

పెన్షనర్ల సమస్యలపై చర్చ

8లో..


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 125

పేజీలు : 08 | వెల: రూ.5/-

గురువారం

ఫిబ్రవరి 06, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


# మహా కుంభాభిషేకానికి వేళాయే..



- 42 ఏళ్ల తర్వాత జరగనున్న మహత్తర ఘట్టం
- ముస్తాబైన కాళేశ్వరం దేవస్థానం
- 7,8,9 వ తేదీల్లో ఉత్సవాలు
- 10,080 కలశాలతో పూజా కార్యక్రమాలు
- మూడు రాష్ట్రాల నుంచి భారీగా తరలి రానున్న భక్తజనం
- అన్ని ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ



సుమారు 42 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో మొదటి సారిగా జరుగుతున్న మహా కుంభాభిషేకానికి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. జయశంకర్, భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శతచండి మహారుద్ర సహస్ర ఘటాభిషేక కుంభాభిషేక మహోత్సవాలకు రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ నుంచే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాలనుంచి భక్తజనం పెద్ద ఎత్తున తరలి రానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమష్టి కృషితో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. 10,080 కలశాలతో జరగనున్న ఈ పూజా కార్యక్రమాలను తిలకించి స్వామీ వారి దర్శనం చేసుకుంటే కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుందని ఆలయ అర్చకులు చెబుతున్నారు. విశ్వ కళ్యాణార్థం తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి చేతుల మీదుగా మహా కుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. - వరంగల్ వాయిస్, మహాదేవపూర్

వివరాలు 2లో..

## కొత్త రుణాలివ్వాలి

- నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి
- రాష్ట్ర కో- ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



2లో..



## నల్లబెల్లి పోలీస్ స్టేషన్ లో సీపీ..

## ఆకస్మిక తనిఖీతో హల్ చల్

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయమే ఇక్కడికి చేరుకున్న సీపీ స్టేషన్ ఆఫీసర్ ఎక్కడ ఉన్నాడు, మిగితా సిబ్బంది ఎక్కడెక్కడ విధులు నిర్వహిస్తున్నారంటూ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను సీపీ పరిశీలించారు. అదే విధంగా వివిధ ఫైళ్లను తనిఖీ చేశారు. సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని సూచించారు.

– వరంగల్ వాయిస్, క్రైం

## మెరుగైన వైద్యం అందించాలి

- ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు సహకరిస్తా
- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల పరిశీలన



8లో..

# మహా కుంభాభిషేకానికి వేళాయే..

- 42 ఏళ్ల తర్వాత జరగనున్న మహత్తర ఘట్టం
- ముస్తాబైన కాళేశ్వరం దేవస్థానం
- 7,8,9 వ తేదీల్లో ఉత్సవాలు
- 10,080 కలశాలతో పూజా కార్యక్రమాలు
- మూడు రాష్ట్రాల నుంచి భారీగా తరలి రానున్న భక్తజనం
- అన్ని ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరంలో ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహా కుంభాభిషేకానికి సర్వం సిద్ధం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించనున్న ఈ మహా కుంభాభిషేకానికి రాష్ట్రం నలుమూలలనుంచే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాలనుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. కుంభాభిషేకం మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాదాయ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య, ఇరిగేషన్, పోలీస్, అగ్నిమాపక, ఆర్టీసీ, సమాచార శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కుంభాభిషేకాన్ని సక్సెస్ చేసేందుకు కృషి చేస్తున్నారు. పుష్కరఘాట్ వద్ద పుణ్యస్నానాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కుంభాభిషేకంలో భాగంగా రాజగోపురంపైకి ఒకేసారి 20మంది వేళ్లేందుకు వీలుగా తాత్కాలికంగా కర్రలతో మెట్లను ఏర్పాటు చేశారు.

మూడు రోజులు పూజా కార్యక్రమాలు..

శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మంగళవాయిద్యములతో వేద స్వస్తివాచకములు, గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వర్ణనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశనం, అఖండ జ్యోతి ప్రజ్వలన, యాగశాల ప్రవేశంతో మహా కుంభాభిషేకానికి శ్రీకారం చుట్టనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు దేవతా స్థాపన పూజలు, హోమాలు, చండీ పారాయణం తదనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అదే విధంగా మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వివిధ పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. 8వ తేదీ ఉదయం 8.30నుంచి 12.30 గంటల వరకు ప్రాతఃసూక్త మంత్ర పఠనం, ప్రాతఃకాల పూజలు, చండీ పారాయణం, మహా రుద్రాభిషేకం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30గంటల వరకు హారతి, మంత్రపుష్పం, చతుర్వేద సేవలు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటలనుంచి శ్రీ మంగళంపల్లి వేణుగోపాల శర్మచే ప్రవచనం అనంతరం కూచిపూడి నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదే విధంగా 9వ తేదీ ఆదివారం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు ప్రాతఃకాల పూజలు, రుద్రహవనం, జయాదులు, బలి ప్రధానం, మహా పూర్ణాహుతి నిర్వహించనున్నారు. ఉదయం 10.42 గంటలకు మహా కుంభాభిషేకం, హారతి ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం బాచంపల్లి సంతోష్ కుమార్ చే ప్రవచనం కార్యక్రమం ఉంటుంది.



### గోపురంపైకి మెట్లు..

9వ తేదీ ఉదయం 10.42 గంటలకు కుంభాభిషేకంలో భాగంగా పీఠాధిపతులు, వేద పండితులు, వీఐపీలు ప్రధాన దేవాలయం గోపురాల పైకి వెళ్లాల్సి ఉన్నందున తాత్కాలికంగా కర్రలతో మెట్లను ఏర్పాటు చేశారు. ఒకేసారి 20మంది నిలబడి పూజలు చేసేలా వీటిని నిర్మించారు. అంతకు ముందే అగ్నిమాపక వాహనాల ద్వారా నీటిని తరలించి ఆలయానికి చెందిన నాలుగు గోపురాలను శుద్ధీకరణ చేయనున్నారు.




### పారిశుద్ధ్య కార్యక్రమాలు..

కుంభాభిషేకం జరుగు మూడు రోజులు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కాళేశ్వరం బస్టాండ్ నుంచి గోదావరి నది వరకు, బస్టాండ్ వద్ద గల దేవస్థానం ఆర్చి గేటు నుంచి ఆంజనేయ స్వామి దేవాలయం ముందుగల ఆర్చ్ గేట్ వరకు దేవస్థానం బయట ఆవరణ మొత్తం క్లీన్ చేసేందుకు అదనంగా స్వీపర్లను నియమించారు. అదే విధంగా మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు రహదారిపై ప్రమాదకరముగా ఉన్న గుంతలను పూడ్చి వేశారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం పాత దేవస్థానం కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో ఎదుట అన్ని సదుపాయాలతో కూడిన మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. భక్తుల తాగునీటికోసం గోదావరి నది, దేవస్థాన ప్రాంగణంలో ఆర్ఓ వాటర్ డ్రమ్ములను ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

### ప్రత్యేక ఘాట్లు..

మహా కుంభాభిషేకం సందర్భంగా వచ్చే భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు వీలుగా ప్రత్యేక ఘాట్లను ఏర్పాటు చేశారు. వృద్ధుల, చిన్న పిల్లల సౌకర్యార్థం తాత్కాలికంగా నీటి షవర్లను పెట్టారు.



గోదావరి నదిలో డేంజర్ జోన్లను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 10 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. స్త్రీలు బట్టలు మార్చుకొనేందుకు వీలుగా తాత్కాలిక షెడ్లు నిర్మించారు. స్నాన ఘట్టాల వద్ద ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక అధికారులను, సిబ్బందిని నియమించి తగు చర్యలు చేపట్టారు.

# కొత్త రుణాలివ్వాలి

- నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి
- రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

**వరంగల్ వాయిస్, హనుమకొండ** : అర్హత కలిగిన రైతులకు లబ్ధి చేకూరేలా కొత్త రుణాలను మంజూరు చేయాలని రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సూచించారు. వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో గురువారం రవీందర్ రావు అధ్యక్షతన డీసీసీబీ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ మాఫీ–2024 కింద లబ్ధి పొందిన రైతులకు త్వరితగతిన తిరిగి కొత్త పంట రుణాలు అందజేయాలని సూచించారు. అదేవిధంగా అర్హత కలిగిన రైతులకు సంబంధించిన ఇన్ వాలిడ్ ఆధార్ లపే ప్రభుత్వం అనుమతితో సరిచేసి రైతులకు లబ్ధి చేకూర్చాలన్నారు. నిర్దేశించిన టార్గెట్ ను గడువులోగా సాధించాలన్నారు. తీసుకున్న రుణాలను రికవరీ చేసి సంఘాలను పటిష్టం చేసేలా సీఈఓ కృషి చేయాలన్నారు. ఐఆర్ ఏసీ నామ్స్ కి లోబడి 31 మార్చి 2025 సంవత్సరానికి గాను నిరార్థక ఋణాలుగా వర్గీకరించబడిన మొండి బకాయిలను రెండు శాతానికి మించకుండా రికవరీ చేయాల్సిన బాధ్యత మేనేజర్లదే అన్నారు. ఎన్ పీఏ రెండు శాతం లోబడి టర్నోవర్ రూ.2,500 కోట్లకు చేరుకునేలా కృషి చేయాలన్నారు. తదుపరి జరగబోయే నాబార్డ్ సమీక్షలో మన బ్యాంక్ 'ఏ' ర్యాంకు పొందేలా అందరూ ఆర్బీఐ, నాబార్డ్ ఆదేశాలను పాటిస్తూ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, డీజీఎం అశోక్, ఏజిఎంలు మధు, గొట్టం స్రవంతి, బోడ రాజు, గంప శ్రవంతి, కృష్ణ మోహన్, డీఆర్ ఓఎస్డీ విజయ కుమారి, వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



# ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే..

- కాంగ్రెస్ ఖాతాలో మరో రైతు బలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంకు చెందిన నాగేశ్వర్ రావు తనకు, తన గ్రామస్థులకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదన్న మనస్తాపంతో గ్రామసభలో పురుగుల మందు తాగి పది రోజులకు పైగా చావుబతుకుల్లో కొట్టుమిట్టాడి నిన్న రాత్రి మరణించడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. చికిత్స పొందుతున్న నాగేశ్వర్ రావును నిన్న ఉదయం ఆసుపత్రిలో పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరినట్లు వెల్లడించారు. వాళ్ళ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పానన్నారు. తరువాత రాత్రికి రాత్రే ఇలా మరణించడం మనసును కలచివేసిందన్నారు. తన కోసం కాకుండా తన వాళ్లకు ఇళ్లు రాలేదని మరణించడం తనకు సమాజం పట్ల ఉన్న ఆవేదనకు, ఆలోచనకు అద్దం పడుతుంది. ఇది ఆత్మహత్య కాదు. ప్రభుత్వం చేసిన హత్యగానే పరిగణించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని సరైన పద్ధతిలో అమలు చేసి ఉంటే నాగేశ్వర్ రావు మరణించే వారు కాదన్నారు. ప్రభుత్వం రూ.25 లక్షల నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# వైభవంగా అయ్యప్ప ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

- అయ్యప్పకు ప్రత్యేక పూజలు
- దివ్య పడిపూజకు హాజరైన భక్తులు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఆలయ పూజారి ఇందుర్తి జానకి రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఉదయం గణపతి హోమం, అష్టోత్తర పూజలు, 108 కళాశాలతో ఘటాభిషేకం నిర్వహించి అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించగా, సాయంత్రం దివ్య పడిపూజ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేదమంత్రోత్సవాల నడుమ అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి పడిపూజ మహోత్సవాన్ని కొనసాగించారు. పలు రకాల అభిషేకాలు నిర్వహించి అయ్యప్పను పూజించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో భోజనాలు చేసి స్వామిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ధర్మశాస్త్ర సేవాసమితి ఆలయ కమిటీ చైర్మన్ నేరెళ్ల అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తవుటం కరుణాకర్, మౌటం కుమారస్వామి, భూపతి శివశంకర్, విద్యాసాగర్, జక్కు కృష్ణమూర్తి, సదాచారి, సమ్మయ్య గౌడ్, సుధాకర్, నంగునూరు సాగర్, చీరాల సాంబయ్య, నాగేందర్, రాజేశం, హరి, నరేందర్ రెడ్డి, చంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



# మల్లంపల్లిలో కలుషిత నీటి ప్రాంతాల గుర్తింపు



**వరంగల్ వాయిస్, మల్లంపల్లి :** నూతనంగా ఏర్పాటైన మల్లంపల్లి మండల కేంద్రంలో ప్రజలు తరుచుగా రోగాల బారిన పడుతూ మరణాల సంఖ్య పెరుగుతున్నారని భవిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తి మొగిలి తెలియజేయ డంతో ఉమ్మడి వరంగల్, అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం పబ్లిక్ హెల్త్ లేబరేటరీ సివిల్ సర్జన బాక్టీరియాలజిస్ట్ డాక్టర్ కృష్ణా రావు, వైద్య బృందం గురువారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్బంగా వారు మల్లంపల్లి, మంచినీళ్ల పల్లి, కుమ్మరి పల్లి, హ్యామయినగర్, గ్రామాల్లో తాగు నీటిని ల్యాబ్ లో టెస్ట్ చేసిన రిపోర్టులను స్థానిక ప్రజలకు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మల్లంపల్లి తాగునీటిలో, కలుషితాలు కలుస్తున్నట్లు గుర్తించినట్లుగా తెలిపారు. ఇదివరకే దీనికి సంబంధించిన రిపోర్టులను మల్లంపల్లి గ్రామ పంచాయితీ అధికారులకు పంపించామన్నారు. కలుషితమయ్యే నీటి ప్రాంతాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ సొసైటీ డైరెక్టర్ గూడెపు ఇందిరా రాజిరెడ్డి, మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు, జిల్లా కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి దేవేంద్ర చారి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి సాంబయ్య, మల్లంపల్లి మండల ముదిరాజ్ సంఘ నాయకులు అంకం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డును బాగు చేసిన స్వచ్ఛంద సంస్థలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా విద్యా వికాస ప్రేరణ ఫౌండేషన్, రోటరీ క్లబ్ హనుమకొండ, ఏకశిలా వాకర్స్ అసోసియేషన్, ఏకశిలా సైకిల్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల ముందు గుంతలతో ప్రమాదకరంగా మారిన రోడ్డును రీసైకిల్ మెటీరియల్ తో పూడ్చి బాగు చేశారు. రోడ్డు ప్రమాదాలకు రోడ్లు కూడా ప్రధాన కారణం కాబట్టి, హనుమకొండలోని స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ప్రజలు బాధ్యతగా భావించి అత్యవసరంగా బాగు చేయవలసిన రోడ్లకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి బాగు చేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రభుత్వ మర్కజి పాఠశాల ముందు ఉన్న రోడ్డును రెండు పొరలు మెటీరియల్ వేసి చదును చేస్తామని విద్యా వికాస ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెండ్లి ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్కజి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ.వి.రామారావు మాట్లాడుతూ పెద్దల ఔదార్యాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏకశిలా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిమట్ల ఎల్లగౌడు, సైకిల్ వాకర్స్ పడాల సోమయ్య ,పెన్నింటి రమణారెడ్డి, పులివెంట్ల అనంత్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రుద్రారపు జ్యోతి, ఉపాధ్యాయులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకశిల ప్రైమ్ లో సహపంక్తి భోజనాలు



**వరంగల్ వాయిస్, దామెర :** దామెరలోని ఏకశిలప్రైమ్ పాఠశాలలో తెలుగు పాఠ్యాంశంలోని ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకొని సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి మాట్లాడుతూ పూర్వపు రోజుల్లో గ్రామస్తులంతా కులాలకు, మతాలకు అతీతంగా, ఏదైనా ఫంక్షన్ జరిగితే అందరూ కలిసి ఒక ఇంటి దగ్గర కూర్చొని సహపంక్తి భోజనాలు చేసేవారని, నేటి ఉరుకుల పరుగుల జీవితంలో నేటి తరం పిల్లలకు అలాంటి నైతిక విలువలు, మానవతా విలువలు మనమంతా ఒక్కటేననే మంచి భావన ఏర్పాటు చేయడంలో భాగంగా తెలుగు ఉపాధ్యాయుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఇలా అందరికీ కూర్చోబెట్టి సహపంక్తి భోజనాలు భోజనాలు ఏర్పాటు చేయడం అందులో నేను కూడా కూర్చొని, అరిటాకులో సాంప్రదాయ బద్ధంగా తినడం చాలా సంతోషాన్ని ఇచ్చిందనిబేతి కొండల్ రెడ్డి అన్నారు. మనవం ఎలాంటి హోదాలో ఉన్న మన పూర్వపు మూలాలను మరిచిపోకూడదన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన తెలుగు టీచర్లకు, విద్యార్థిని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్ స్టాఫ్ ఇంచార్జి విజయ్ కుమార్, నవీన్, స్వరూప రాణి, మమత, వినయ్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇసుక లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, మల్హర్ (కాటారం) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో ఇసుక లారీ భీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే కాటారం గ్రామానికి చెందిన తోట రవి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మహదేవ్ పూర్ నుంచి భూపాలపల్లి వెళ్తున్న ఇసుక లారీ అతి వేగంతో ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న రవికి తీవ్ర గాయాలయ్యాయి. భాదితుడిని స్థానికులు భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ లారీతో సహా పరారయ్యాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇసుక లారీలను నియంత్రించాలని ప్రజలు, పలు సంఘాల నాయకులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.

# దేవాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం మాఘమాస శుక్ల నవమి సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ముసునూరు నరేష్, కమిటీ వారిచే ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పురాతన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో 20వేల రూపాయలతో ఆలయ కమిటీ వారిచే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన గౌడ్, బండారి శంకర్, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, బటిక స్వామి, మూల శ్రీనివాస్ గౌడ్, దయ్యాల భద్రయ్య తదితరు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, క్రైం :** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని మానన్ భట్ ఐపీఎస్ అన్నారు. గురువారం కేఎంసీ గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీలో దాదాపు 300 మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్ టి –సేఫ్ అప్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో మీ వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, వివరాలును గుర్తుతెలియని వ్యక్తులుతో పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై, టీ–సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930కి ఫిర్యాదు చేయాలి. అన్నోన్ నెంబర్స్ నుంచి మహిళలకు ఎవరి నుండైన ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 కి ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని మనన్ భట్ అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపల్ డి.సునీత, షీ టీమ్ ఇన స్పెక్టర్ కే.సుజాత, ఎస్ఐ కంచి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణ బిల్లుతో మాదిగ ఉపకులాలకు న్యాయం



**వరంగల్,వాయిస్, డోర్నకల్ :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి మాదిగ ఉపకులాలకు న్యాయం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు చేప్పిన సందర్భంలో ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ వర్గ అభివృద్ధికై కాంగ్రెస్ పార్టీ దృడ నిర్ణయంతో ఉందని, తప్పక అధిక నిధులు కేటాయించి అదుకుంటుందని వివరించారు. కాసం శేఖర్, పగిడిపల్లి వెంకన్న, అంగోత్ వెంకన్న, బాబు, శ్రీనివాస్, మాద శ్రీనివాస్, కోటేష్, నాని, శంకర్, ఫరీద్, నాగరాజు, భద్రు తదితరుల పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 15ను జాతీయ సెలవుదినంగా ప్రకటించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15 నాడు జాతీయ సెలవు దినం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని అంతర్జాతీయ క్రీడాకారుడు, కాకతీయ యూనివర్సిటీ జేఏసీ లీడర్ ఇస్లావత్ ఆలోజ్ నాయక్ కోరారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, హింస పాపమని, మత్తు, ధూమ పానం శాపమని హితవు పలికి భారతదేశ వ్యాప్తంగా తిరిగి యావత్ బంజారాలకు ఆదర్శపురుషుడయ్యారు. ఆంగ్లేయులపై యుద్ధంపై ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, క్షేత్రధర్మాన్ని రక్షించడం వంటి బోధనలు చేశారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించుకొని జాతి చరిత్రను భారతదేశ వ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపించేందుకు సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం తరపున ప్రభుత్వాన్ని కోరారు.

# నిత్యావసర సరుకుల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** 'అలయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షుడు అలై దోమల నాగేందర్ ఆధ్వర్యంలో క్లబ్ లైఫ్ మెంబర్ అలై పొరండ్ల సతీష్ కుమార్ జన్మదినం సందర్భంగా స్వయంకృషి వృద్ధాశ్రమంలో బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వరంగల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అలై చిప్ప వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ ఈ విధంగా జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమం చేయడం మిగతా క్లబ్ సభ్యులకు ఒక ప్రేరణగా నిలుస్తుందని, ఇతర సభ్యులకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై మంత్రి లింగమూర్తి, వరంగల్ డిస్ట్రిక్ట్ మల్టిపుల్ కోఆర్డినేటర్ అలై గజ్జెల ఓంకార్ లింగం శాస్త్రి, వరంగల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ పెంట కుమార్, జోనల్ చైర్మన్ అలై ఎండీ దస్తగిరి,ఇతర క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన గొంది వెంకట్ రెడ్డి దశదినకర్మలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, జాకీర్ ఆలీ, బొల్లు రాజు, విద్యాసాగర్, సునీల్ రెడ్డి, సాంబయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

- సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఆర్టీఐ కమిషనర్లను నియమించాలి
- తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోపీనాథ్ కట్టెకోల ఎన్నిక



**వంగల్ వాయిస్, హైదరాబాద్ :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోలను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్.చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలుకోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతో పాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతీ నుంచి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన గోపీనాథ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి, పందుల రాజు గౌడ్, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట పరామర్శ



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారుపెల్లి రామచంద్రారెడ్డి తల్లి సుశీలమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హాజరై వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గం 1వ డివిజన్ పెగడపల్లిలో ఇటీవల మరణించిన బీజేపీ సీనియర్ నాయకులు సకినాల లింగయ్య యాదవ్ కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. వారితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 66 డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమార్ స్వామి, బీజేపీ రాష్ట్ర నాయకులు నాంపల్లి శ్రీనివాస్, రైల్వే బోర్డు మెంబర్ తాళ్ల శ్యామ్, హసన్ పర్తి మండల అధ్యక్షుడు మారం తిరుపతి, మాజీ మండల అధ్యక్షులు గుర్రాల చంద్రమౌళి, మాజీ మార్కెట్ డైరెక్టర్ షకిలం రాజేశ్వరరావు, మట్టెడ సుమన్, సురేందర్, బొల్లం రంజిత్, చొక్కమ్ మహేందర్, బాలకృష్ణ, రమేష్, సుమన్, అశోక్, శివకృష్ణ, కన్నాయ, శ్రీకాంత్, మాట్లా దయాకర్, చింతల రాకేష్, గోలి శ్రీకాంత్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసిస్ట్ ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల సమీక్షా సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాది కారి కార్యాలయంలో రెండు జిల్లాల కార్యదర్శులు ఎం.అవినాష్, గోపు సతీష్ ల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఫార్మసిస్ట్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలు గురించి స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. మెడిసిన్స్ అన్నీ కూడా ఆన్ లైన్ లోనే ఎంట్రీ, ఇష్యూ చేస్తూ మళ్లీ ఆఫ్ లైన్ లో రిజిస్టర్స్ రాయాలంటే పని భారం పెరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్య అథితి గా విచ్చేసిన స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఫార్మసిస్ట్స్ ఎదుర్కొంటున్న అన్నీ సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ఫార్మసిస్ట్స్ అజిత, విజయ లక్ష్మి, విజయ, వెంకటేశ్వర్లు, సునీత, రత్న ప్రభ, అరుణా కుమారి, సంతోష్, జ్యోతి, సృజన, సుధా రాణి, సరళా రాణి, అన్వేష్, అంజి, రాకేష్, సతీష్, అనిత, విజేత, రంగారావు, అనూష, లీలా రాణి, జ్యోత్స్న, అనిత, అనిల్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాత ముగ్దుంపురాన్ని చెన్నారావుపేటలో కలపాలి

➲ నర్సంపేట ఆర్డీఓ, ఎంపీడీవోలకు వినతి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** పాత ముగ్దుంపురం గ్రామాన్ని చెన్నారావుపేట మండలంలో కలపాలని పాత ముగ్దుంపురం గ్రామ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేట ఆర్డీఓ, ఎంపీడీవోలకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత ముగ్దుంపురం గ్రామం గతంలో నర్సంపేట మండలంలో కొనసాగిందన్నారు. నర్సంపేట మండలం నుంచి చెన్నారావుపేట మండలంలో కలపాలని అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దీంతో గత ప్రభుత్వం ప్రత్యేక జీవో నంబర్ 260 ద్వారా తిరిగి చెన్నారావుపేట మండలంలో పాత ముగ్దుంపురం గ్రామాన్ని కలపడం జరిగిందన్నారు. రానున్న ఎంపీటీసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎంపీటీసీ స్థానం నర్సంపేట మండలంలోని గురిజాలలో పాత ముగ్దుంపురం గ్రామాన్ని కలిపారన్నారు. దీనిని గ్రామస్తులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వెంటనే పాత ముగ్దుంపురం గ్రామం పక్కనే ఉన్న చెన్నారావుపేట మండలంలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకరి సాంబయ్య, పోలెపల్లి భిక్షపతి, బండారి సత్యం, ననుమాస వీరస్వామి, మేకల సదానందం, శంకేశి రంజిత్ కుమార్, పోలెపల్లి రమేష్, నాంపల్లి మల్లయ్య, సమ్మయ్య, షేక్ పాషా, పటాన్ యాకుబ్, బొత్త, సుంకరి సురేష్, షేక్ అఫ్జల్, అక్బర్ అయుందాసి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, ఫిబ్రవరి 06, 2025

# బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

◆ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బాలికలు చదువుతోపాటు క్రీడా,సామాజిక అంశాలు, ఆర్థిక అభివృద్ధి,స్వయం రక్షణలో ముందుండాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్త్రీ, శిశు, సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సమాజంలో బాల బాలికలు సమానమని, బాలికలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు. జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని బేటి బచావో బేటి పడావో నినాదంతో పోస్టర్లు ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ బాలికలు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని వారు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధన కోసం కృషి చేయాలని, అధికారులంతా బాలికల అభ్యున్నతకి తోడ్పాటును అందించాలని సూచించారు. బాలికలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కౌమార దశలో ఉన్న ఆడపిల్లలకు సరైన దిశానిర్దేశం చేస్తూ బావిభారత పౌరులుగా తీర్చిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ జి.నాగవాణి, డీఈఓ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్య అధికారి డాక్టర్ మురళీధర్, డీఆర్డీఓ మధుసూదన రాజు, సీడబ్ల్యూసీ మెంబర్స్ డేవిడ్, అశోక్ కుమార్, డీడబ్ల్యూఓ ధనమ్మ, తదితరులు జాతీయ బాలిక దినోత్సవం గురించి మాట్లాడారు. అంతకుముందు బాలికలు మహిళా బాలికా సంరక్షణపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ క్రీడా పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు నిలోఫర్, శిరీష, ఎల్లమ్మ, రాజ్యలక్ష్మి, లక్ష్మి, కమల, విజయలక్ష్మి, ఇందిరమ్మ, సఖి సెంటర్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్షయ నివారణ కార్యక్రమంపై సమీక్ష



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జాతీయ క్షయ నివారణపై గురువారం ఐ.డీ.ఓ.సీలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో క్షయ వ్యాధి నోడల్ పర్సన్స్, ల్యాబ్ టెక్నీషియన్, టీబీ సూపర్ వైజర్లతో జిల్లా వైద్యా శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు ఉన్నచో తెమడ పరీక్ష చేయించాలని, ప్రతి నెల స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేసీ, క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించాలని, క్షయ వ్యాధి ఉన్న వారు, ఆరు నెలలు మందులు వాడినచో క్షయ నయమవునని, వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం ప్రతినెల క్షయ వ్యాధిగ్రస్తుడికి రూ.500 కూడా ఇవ్వడం జరుగుతుందని ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, కెవీ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్, హెచ్ఈవో రామకృష్ణ, నీలిమ శ్వేత, అశోక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 10న డీ వార్మింగ్ డే ను విజయవంతం చేయండి



**వరంగల్ వాయిస్, నడికూడ :** నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా ఈ నెల 10న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేయించాలని డాక్టర్ పి.స్వాతి అన్నారు. గురువారం డివిజినల్, మండల స్థాయి అధికారుల సమావేశం వైద్యాధికారులు పి స్వాతి, దివ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పరకాల ఎంపీడీఓ కాన్ఫరెన్స్ హాల్ లో స్థానిక పరకాల, నడికూడ మండలాలకు సంబంధించిన అధికారుల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10న సంవత్సరం వయసు నుంచి 19 ఏళ్ల పిల్లలకు ప్రభుత్వం నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వివిధ శాఖల అధికారులను కోరారు. పరకాల, నడికూడ తహసీల్దార్లు, మండలం అభివృద్ధి అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీ సమావేశాల్లో చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపుతూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డిల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డికూడ మండల సమన్వయ కమిటీ సభ్యులు పర్నం మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాయపర్తి గ్రామ కమిటీ అధ్యక్షులు మారం దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గాదె శంకరయ్య, కడారి సమ్మయ్య, పిఏసిఎస్ వైస్ చైర్మన్ చెలుమల్ల సురేందర్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్ల రమేష్, నారగానీ శ్రీనివాస్, చిదిరిక కోటి, గాదె వెంకటస్వామి, సీనియర్ నాయకులు కోడెపాక సుదర్శన్, లింగయ్య, నవీన్, భద్రయ్య, మొగిలి, బాబు, కృష్ణ, మాట్ల రాజు, ప్రసాద్, మార్త సారయ్య, మేదర చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## గణపురంలో..





వరంగల్ వాయిస్, గణపురం : తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసి ఎన్నో ఏళ్ల ఎస్సీల ఆకాంక్షను నెరవేర్చినందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్మూర్ల ఎల్ల స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ ఎస్సీల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణను న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేవంత్ సర్కారు అమలు చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్గీకరణ అన్ని రంగాల్లో ఎస్సీల అభివృద్ధికి దోహదపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు ఎస్సీలపై ముసలి కన్నీరు కార్చి ఎస్సీ వర్గీకరణ చేయకుండా కుట్రపూరితంగా తప్పుకున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వం ఎస్సీల ఆకాంక్షను నెరవేర్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎస్సీల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపించారని కాంగ్రెస్ నేతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఆర్ రాజేందర్, వి.బోనసుందర్, పి.వెంకటేష్, ఎం.రాజు, టి.దుర్గయ్య, ఎం.శివశంకర్, ఎం.మల్లికార్జున్, బి.రాజమౌళి, టి.పున్నం తదితరులు మాట్లాడారు.

## లక్ష రూపాయల రుణం మంజూరు చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఐఎన్టీయూసీ గ్రేటర్ వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ కెనరా బ్యాంక్ మేనేజర్ ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ అవుటో సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో రూ.50,000 రుణం మంజూరు చేసి అదుకున్నారని, అలాగే ప్రస్తుతం కూడా మా కార్మికుల అర్థిక అవసరాల దృష్ట్యా లక్ష రూపాయల రుణం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు పాశం రవి యాదవ్, జనరల్ సెక్రటరీ డి.రమేశ్, సీహెచ్ సంపత్, వర్కింగ్ ప్రెసిడెండ్ బైరబోయిన గట్టయ్య, కార్యదర్శి ఎస్.శేఖర్, పి.ధర్మారావు, డబ్ల్యూ.సత్యనారాయణ, ప్రమీల, స్వరూప, సునీత, సరిత తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రేగూరి విజయపాల్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి వెంట పరకాల మున్సిపాలిటీ, పరకాల, నడికూడ మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

## గంట రవికుమార్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడు గంటా రవి కుమార్ ను కాశిబుగ్గ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు గురువారం గంటా రవికుమార్ ను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కూచన ఏకాంబరం, ఆలయ ప్రధాన పూజారులు శ్రీకాంత్ చారి, మధు, 19వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మామిడాల సతీష్ కట్టర్ హిందూ, కందుకూరి శ్రీనివాస్, గోషికొండ రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అరూరి రమేష్ కు పెసరు పరామర్శ



**వరంగల్ వాయిస్ , దామెర :** వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అరూరి రమేష్ తల్లి అరూరి వెంకటమ్మ ఇటీవల మరణించగా నేడు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి అరూరి రమేష్ ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల శ్రీనివాస్, గురిజాల శ్రీరామ్ రెడ్డి, దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, ముల్క ప్రసాద్, మొలుగురి శ్రీనివాస్, జాన్ విక్రమ్, దేవేందర్ రెడ్డి, ల్యాద రాజేష్, ఏలియా, కాగితాల సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- ➲ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం
- ➲ అధికారులు సమన్వయంతో మినీ జాతరను విజయవంతం చేయాలి
- ➲ జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ఈనెల 12 నుండి 15 వరకు మేడారం గ్రామంలో జరగనున్న మినీ మేడారం జాతరను విజయవంతం చేయడానికి భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. గురువారం తాడ్వాయి మండలంలోని మేడారంలో పలు శాఖల అధికారులతో కలిసి వైద్య శిబిరం ఏర్పాటు, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను, మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఏర్పాటు చేసిన గదులను పరిశీలించిన అనంతరం గద్దెల ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు 10 నుంచి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నాలుగు రోజులపాటు జరిగే జాతర సందర్భంగా నిరంతరం విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్య శాఖ సిబ్బంది అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర సమయాలలో ఇబ్బందులకు గురయ్యే వారిని జిల్లా కేంద్రానికి తరలించడానికి వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా, చోరీ సంఘటన జరగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జంపన్న వాగు, గద్దెల ప్రాంతం, మేడారం పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్మికులచే నిరంతరం శుభ్రం చేయించాలని డీపీఓను ఆదేశించారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చిన పక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలలో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని, నిరంతరం పోలీస్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న సందర్భంగా గద్దెల ప్రాంతంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిర్లను ఏర్పాటు చేయడమే కాకుండా మ్యాట్లను ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. దాదాపు 5 కోట్ల 30 లక్షల రూపాయలతో వివిధ పనులను పూర్తి చేయడం జరిగిందని వివరించారు. జాతరను పురస్కరించుకొని పలుచోట్ల ప్రత్యేకంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, తాగునీటి కొరత ఏర్పడకుండా నిరంతరం నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి నిరంతరం బస్సులను మేడారం నడిపించనున్నారని, జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులు తమ మొక్కులను చెల్లించుకొని తిరుగు ప్రయాణం కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, డీపీఓ దేవరాజ్, డీఎంహె చ్ఓ గోపాల్ రావు, ఇరిగేషన్ ఈఈ నారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

### భారీగా బెల్లం పానకం, గుడుంబా ధ్వంసం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గుడుంబా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల డోర్నకల్ మండలంలోని హున్యా తండా, బోడ హట్య తండా, మహబూబాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో మహబూబాబాద్ ఎక్సైజ్ సిబ్బంది వరంగల్ ఎన్ ఫోర్స్ మెంట్ సిబ్బంది, డోర్నకల్ పోలీసులు సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో (46) లీటర్ల సారాయి, (250) కిలోల బెల్లం, (01) గ్లామర్ బైక్ ను సీజ్ చేసి (1000)లీటర్లు బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఏడు కేసులు నమోదు చేసి, పది మంది ముద్దాయిలను సంబంధిత తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు చంద్ర శేఖర్, అశోక్, కిరీటి, డోర్నకల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ అన్నారు. వరంగల్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ఆధ్వర్యంలో గురువారం మట్టేవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై గట్టి నిఘా ఉంటుందని కౌన్సెలింగ్ చేశారు. సత్ప్రవర్తన కలిగినవారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్స్ ఎస్.రాజు, కె.శ్రీధర్, ఎం.రంజిత్ కుమార్, జి.బాబులాల్, ఎల్.పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## కుమ్మరి నాగేశ్వర్ ది ప్రభుత్వ హత్యే



**వరంగల్ వాయిస్, ములుగు :** కన్నయ్య గూడెం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి నాగేశ్వర్ గత నెల 23న గ్రామ సభ సాక్షిగా తాను అన్నివిధాలా ఈ ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు అర్హత ఉన్నా తన పేరు జాబితాలో తన పేరు లేదని మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి హాస్పిటల్ లో చేరి నేడు చనిపోయారు. ఇప్పటి వరకు కూడా ఈ ప్రభుత్వం స్పందించకపోవటం సిగ్గు చేటని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండిపడ్డారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

## ఘనంగా కృష్ణ డయాగ్నోస్టిక్ 10వ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** స్థానిక కృష్ణ డయాగ్నోస్టిక్ 10వ వార్షికోత్సవ కార్యక్రమం సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ–వరదరాజేశ్వర్ రావు గురువారం ల్యాబ్ ను సందర్శించి కేక్ కట్ చేసి యజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ సుధీర్, రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అఫ్సర్, చీదురాల కుమారస్వామి, ఎల్లగౌడ్, కుమార్ గౌడ్, షబ్బీర్, మంజూర్, బాలకృష్ణ, దుబ్బాక శివ, విక్రమ్, ఎర్ర శ్రీకాంత్, పాపారావు, అన్వర్, బుజ్జ వీర రాఘవ రావు, సోహెల్, పెద్దూరి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బోలుగొడ్డు సారయ్యకు ఎమ్మెల్సీ పరామర్శ



**వరంగల్ వాయిస్, రంగశాయిపేట :** మాజీ కార్పొరేటర్ బోలుగొడ్డు సారయ్య సతీమణి బోలుగొడ్డు విమలాదేవి దశదిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరితో పాటు మాజీ మేయర్ గుండా ప్రకాష్, కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శ్రీమాన్, దిట్టి కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ, పోషాల పద్మ, బాసాని శ్రీనివాస్, ధూపం సంపత్, బిల్ల శ్రీకాంత్, జన్ను రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోరంట్ల రాజు, కరాటే ప్రభాకర్, చాగంటి శ్రీనివాస్, బొలుగొడ్డు శ్రీనివాస్, డాక్టర్ హరి రమాదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఇనుగాల పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** ఇటీవల మరణించిన పలు కుటుంబాలను వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఆత్మకూరు మండలం కొత్తగట్టు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గండు సురేందర్ నాన్న కీ॥శే గండు నర్సయ్య, చౌల్లపల్లి గ్రామానికి చెందిన కీ॥శే కుక్కమూడి పోషయ్య ఇటీవల స్వర్గస్తుతయ్యారు. నేడు వారి కుటుంబ సభ్యులను వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఓదార్చి, పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెన్నకేశవ స్వామి సేవలో దుబ్బాసి మానస–నవీన్ దంపతులు

- తొమ్మిదేళ్లుగా ఆలయంలో అన్నదానం
- దుబ్బాసి దంపతులకు భక్తుల అభినందనలు
- ఈ నెల 8న స్వామి వారి కల్యాణ మహోత్సవం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలోని చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో ఆ దంపతులు ఏటా అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ నెల 8న శ్రీ దేవి–భూదేవి సమేత చెన్న కేశవ స్వామికళ్యాణ మహోత్సవం ఘనంగా జరపనున్నారు. శనివారం ఈ ఉత్సవానికి హాజరయ్యే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు అన్నదాన దాతలు దుబాసి మానస నవీన్ గురువారం వెల్లడించారు. కన్నుల పండుగగా జరిగే చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవంలో ప్రజల అధిక సంఖ్యలో.. సకుటుంబ సపరివారం సమేతంగా విచ్చేసి, స్వామి వారి ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు స్వీకరించాలని పిలుపునిచ్చారు. స్వామివారి సేవలో భాగంగా గత తొమ్మిదేళ్లుగా దుబ్బాసి మానస నవీన్ అన్న ప్రసాదం అందిస్తుండటం పట్ల భక్తులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు. అన్నదానం అన్ని దానాల్లో కెల్లా గొప్పదానమని, అందులో పవిత్రమైన ఆలయంలో స్వామివారి సన్నిధిలో భక్తులకు అన్నప్రసాదం అందించడం గొప్ప విషయమని పలువురు తెలిపారు. మానస న వీన్ లు పుణ్య దంపతులుగా వర్ధిల్లాలనీ పెద్దలు దీవించారు. ఈ నెల 8న అంగరంగ వైభవంగా జరగబోయే కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎంపీవో, స్పెషల్ ఆఫీసర్ నీరుకుళ్ల వద్దుల విమల, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి జితేందర్ రెడ్డి తదితరులు హాజరవుతారనీ ఆలయ పూజారులు, ఉత్సవ కమిటీ వారు పేర్కొన్నారు.

# రెండు సినిమాలతోనే..
# యమ క్రేజీ



ప్రస్తుతం ఈ క్రేజీ హీరోయిన్ పేరు టాలీవుడ్‌లో బాగా వినిపిస్తోంది. అలాగనీ ఈ ముద్దుగుమ్మ పెద్దగా సినిమాల్లో నటించలేదు. ఇప్పటివరకు కేవలం రెండంటే రెండు సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. అందులో ఒకటి యావరేజ్ కాగా మరొకటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మూవీ. దీంతో ఈ అమ్మడికి సినిమా అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మరో తెలుగు సినిమాలో ఈ అందాల తారకు అవకాశం దక్కించి. క సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం కే ర్యాంప్ లో ఈ ముద్దుగుమ్మకు కథానాయికగా అవకాశం లభించింది. దీంతో ఈ బ్యూటీ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంటోన్న ఆమె మరెవరో కాదు యుక్తి తరేజా. నాగ శౌర్య నటించిన రంగబలి మూవీతో తెలుగు సినిమాకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ మార్కో సినిమాతో పాన్ ఇండియా ఫేమస్ అయ్యింది. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు కిరణ్ అబ్బవరం సినిమాలోనూ కథానాయికగా అవకాశం దక్కించుకుంది. దీంతో పాటు ఓ కన్నడ సినిమాలోనూ ఈ ముద్దుగుమ్మకు హీరోయిన్ గా ఛాన్స్ దొరికింది. హరియాణాలోని ఓ మధ్య తరగతి కుటుంబంలో పుట్టింది యుక్తి తరేజా. చిన్న వయసులోనే మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. 2017లో ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ అందాల పోటీల్లో విజేతగా నిలిచింది. డిగ్రీ ఆఖరి సంవత్సరంలో ఎమ్ టీవీ సూపర్ మోడల్ కాంటెస్ట్ లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది యుక్తి. ఎలాగైనా ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్ గెలవాలనుకున్న ఈ ముద్దుగుమ్మ డిగ్రీ పరీక్షలు ఎగ్గొట్టి కాంపిటీషన్ లో పాల్గొంది. విజేతగా నిలవకపోయినా నాలుగో స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. సినిమాల్లోకి రాక ముందు పలు టీవీషోస్, రియాలిటీ షోస్, మ్యూజిక్ వీడియోల్లో నటించింది యుక్తి తరేజా. ఆ తర్వాత రంగబలి తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. మార్కో సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు తెచ్చుకుంది. ఇక సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మకు ఓ రేంజ్ లో ఫాలోయింగ్ ఉంది. తను షేర్ చేసే గ్లామర్ ఫొటోస్, వీడియోలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తుంటుంది.

## పెళ్లి పీటలెక్కనున్న
## పార్వతి నాయర్

మలయాళ ప్రముఖ హీరోయిన్ పార్వతి నాయర్ త్వరలోనే పెళ్లిపీటలెక్కనుంది. ఓ వ్యాపార వేత్తతో కలిసి ఆమె ఏడడుగులు నడవనుంది. చెన్నైకి చెందిన వ్యాపారవేత్త ఆశ్రిత్ అశోక్ తో ప్రేమలో ఉన్న ఆమె త్వరలోనే ఏడడుగులు వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అంతేకాదు తమ నిశ్చితార్థం జరిగినట్లు సోషల్ మీడియాలో ఫొటోలను కూడా షేర్ చేసింది. దీంతో కొద్ది క్షణాల్లోనే ఈ ఫొటోలు వైరల్ గా మారాయి. కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు పార్వతి నాయర్– అశోక్ లకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'మైసూర్ శాండల్' సోప్ బ్రాండ్ అంబాసిడర్‌గా పార్వతి నాయర్ పేరు మార్మోగిపోయింది. ఇప్పటి వరకు సుమారు 30కి పైగా చిత్రాల్లో నటించిందీ అందాల తార. తెలుగులో న్యాచురల్ స్టార్ నాని నటించిన జెండాపై కపిరాజు సినిమాలో పార్వతి నాయర్ పాత్రలో మెప్పించింది. గతేడాది విజయ్ నటించిన ది గోట్ చిత్రంలోనూ ఓ కీలక పాత్రలో మెరిసిందీ అందాల తార.



## ఫిబ్రవరి 6న తెలుగు సినిమా దినోత్సవం




ఏటా పండుగలా నిర్వహించాలని ఛాంబర్ నిర్ణయం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీని తెలుగు సినిమా దినోత్సవంగా సెలబ్రేట్ చేయాలని, అలాగే ఛాంబర్ తరపున ఉత్తమ ప్రదర్శన కనబరిచిన చిత్రాలు, నటీనటులకు అవార్డులు, పద్మ ఇంకా ఇతర అవార్డులు పొందిన వారందరినీ సన్మానించాలనేలా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 'భక్త ప్రహ్లాద' విడుదలైన ఫిబ్రవరి 6ను తెలుగు సినిమా పుట్టిన రోజుగా ఇకపై గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయనున్నట్లుగా తెలుపుతూ.. ఆ రోజున ప్రతి నటీనటుడి ఇంటిపైన, అలాగే రాష్ట్రంలోని థియేటర్లపైనా జెండా ఎగురవేయాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పేర్కొంది. ఈ మేరకు తెలుగు సినిమా పుట్టినరోజుకు సంబంధించిన జెండా రూపకల్పన బాధ్యతను సీనియర్ సినీ రచయిత పరిచూరి గోపాలకృష్ణకు అప్పగించినట్లు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. గురువారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రముఖులు పాల్గొని.. ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. ఈ ఏడాది సింపుల్‌గా ప్రారంభించి, ప్రతి ఏడాది ఘనంగా చేయదలిచాము. తెలుగు సినిమా పుట్టుకను రాబోయే తరాలకు కూడా గుర్తుండేలా చేయాలన్నదే మా ప్రయత్నం. తెలుగు సినిమా చరిత్ర రాబోయే తరాలకు తెలియాలనే తెలుగు సినిమా దినోత్సవం జరపుతున్నాము. వచ్చే ఏడాది నుంచి గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేయటంతో పాటు.. ఆ ఏడాది ప్రతిభావంతులకు, పద్మ అవార్డ్ గ్రహీతలను సన్మానించే పరిశీలన చేస్తున్నాము. గద్దర్ అవార్డ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం ప్రొ యాక్టివ్‌గా ఉంది.. 'భక్త ప్రహ్లాద' విడుదలైన ఫిబ్రవరి 6 తెలుగు సినిమా పుట్టిన రోజు. తమిళ వాళ్లు మాది అని చెప్పుకునే 'కాళిదాసు' మన తెలుగు సినిమానే. హిందీ తొలి సినిమా 'ఆలం ఆరా', తెలుగు వారి 'భక్త ప్రహ్లాద', తమిళ వారి 'కాళిదాసు' ఇలా అన్నీ సినిమాల్లో ఎల్ వి ప్రసాద్ యాక్ట్ చేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ ఇండస్ట్రీకి రెండు కళ్లలా తెలుగు సినిమా పరిశ్రమలో చరిత్ర సృష్టించారు. సినిమా వారంతా గర్వపడే రోజు ఇదని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 6ను ప్రతి ఏడాది తెలుగు సినిమా దినోత్సవంగా గ్రాండ్‌గా జరపనున్నాం. 1973లో నన్ను అట్లూరి పూర్ణచంద్రరావు పరిచయం చేశారు. వారు సినిమా రిప్రజంటేటివ్‌గా కెరీర్ ప్రారంభించి నిర్మాతగా మారి ఎన్నో గొప్ప సినిమాలు చేశారు.

## ఎల్లమ్మకు సర్వం సిద్ధం



బలగం సినిమాతో దర్శకుడిగా మారి తొలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టి బలగం వేణుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2023 లో విడుదలైన ఈ సినిమా ప్రశంసలతో పాటు కాసుల వర్షం కురిపించింది . వేణు ఈ చిత్రానికి గాను జాతీయ అవార్డు సైతం అందుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ సినిమా రిలీజ్ అయి చాలా కాలం అవుతున్నా కూడా మరో సినిమాను పట్టాలెక్కించలేదు ఈ దర్శకుడు. బలగం సినిమాను నిర్మించిన దిల్ రాజు బ్యానర్ లోనే తన రెండవ సినిమా చేయాల్సి ఉంది.అయితే ఈ కథ అందరి చుట్టూ తిరిగి ఫైనల్ గా యంగ్ హీరో నితిన్ దగ్గరకు వచ్చి చేరింది. పలు మార్పులతో మొత్తానికి ఈ సినిమా అక్కడ ఓకే అయింది. ఈ కథకు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే యల్లమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేసి ఉంచారు. ప్రస్తుతం నితిన్ చేస్తున్నరాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలు చివరి దశ షూట్ లో ఉన్నాయి. ఇక ఇప్పుడు వేణు దర్శకత్వంలో ఎల్లమ్మ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు నితిన్. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి ఎండిరగ్ లేదా మార్చ్ లో ముహూర్తం పూజ ఉండనుందట. ఏప్రిల్ లేదా మే నుండి షూటింగ్ మొదలు కానుంది. నితిన్ ను సరికొత్తగా చూపించేందుకు కొత్త మెకోవర్ ట్రై చేస్తున్నాడు దర్శకుడు వేణు యెల్దండి. దాదాపు రెండేళ్లుగా ఈ కథ మీద కసరత్తులు చేస్తున్న వేణు ఈ సినిమాతో నితిన్ కు ఎంత పెద్ద హిట్ ఇస్తాడో చూడాలి.

# బాలల హక్కులు పరిరక్షించాలి

- అందుకు అందరి భాగస్వామ్యం అవసరం
- అడిషనల్ డీసీపీ ఎన్.రవి

**వరంగల్ వాయిస్, క్రైం :** అందరి భాగస్వామ్యంతో బాలల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.రవి అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జనవరి మాసంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్, బాలల సంరక్షణ అనే అంశంపై గురువారం హనుమకొండలోని అసుంత భవన్ లో పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖలు,ఎన్జీవోల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథగా విచ్చేసిన అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.రవి మాట్లాడుతూ సమాజంలో పోలీస్ ఇతర ప్రభుత్వ శాఖలు బాలల సంరక్షణకు పనిచేసినా ఏదో రూపంలో





హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. బాలల అమాయకత్వం, పేదరికాన్ని ఆసరా చేసుకుని కొందరు స్వార్ధపరులు వాళ్ళని బాల కార్మికులుగా మార్చుతున్నారన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనవరి 2025 మాసంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో అందరూ ఐక్యంగా, సమన్వయంతో పనిచేసి సత్ఫలితాలు సాధించారన్నారు. మొత్తం 162 మంది బాల, బాలికలను రెస్క్యూ చేసి వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. అయినప్పటికీ ఆయా సంస్థలు, పని ప్రదేశాల్లో ఇంకా బాల కార్మికులను నియమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా 18 సంవత్సరాల లోపు బాలలను పనిలో పెట్టుకున్నట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పోలీసు కేసులతో పాటు వారిని బైండోవర్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, హనుమకొండ, వరంగల్, జనగాం జిల్లాల బాలల సంక్షేమ సమితి చైర్మన్లు అన్నమనేని అనిల్ చంద్రారావు, కె.వసుద, ఉప్పలయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల సభ్యులు పి.సుధాకర్, కె.దామోదర్, రాజేంద్రప్రసాద్, రామలీల, సుజాత, డాక్టర్ మధు, సహిదా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలపై చర్చ

**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి :** వరంగల్ ఎన్పీడీసీఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం వడ్డేపల్లి రోడ్డులోని పల్లా రవీందర్ రెడ్డి భవన్ లో గురువారం బి.మొగిలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ీసందర్భంగా ఆరు జిల్లాలకు సంబంధించిన పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. తదుపరి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎండి.సుల్తాన్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్పీడీసీఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.మధన్ మోహన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.మచ్చేంద్రయ్య, కోశాధికారి జి.లక్ష్మీనారాయణ, ఆఫీస్ కార్యదర్శి పి.రాజ్ కుమార్, జేఏసీ సభ్యులు కాలిదాస మూర్తి, కార్పొరేట్ సెక్రటరీ అశోక్ రెడ్డి, సర్కిల్ సెక్రటరీలు సీహెచ్.సమ్మయ్య, టి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాల్లో యువతే కీలకం : చల్లా ధర్మారెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్ర ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ నే కోరుకుంటున్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలపై ప్రజలు గుర్రుగా ఉన్నారన్నారు. గురువారం హనుమకొండలోని ధర్మారెడ్డి నివాసంలో సంగెం, గీసుగొండ, ఖిలా వరంగల్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకులతో ఆయన సమావేశయ్యారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కు త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయన్నారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పై చేస్తున్న తప్పుడు ప్రచారాలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి

- ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు సహకరిస్తా
- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల పరిశీలన

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సందర్శించారు. ఆసుపత్రి ఆవరణతో పాటు కళాశాల లెక్చర్ హాల్, హాస్టల్ లో కలియ తిరిగారు. వైద్య విద్యార్థులలో మాట్లాడి వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి సంబందించిన అంశాలు తన దృష్టికి వచ్చాయన్నారు. శానిటేషన్ విషయంలో నర్సంపేట మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్ల చేయిస్తానన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం హాస్పిటల్ లో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యకు చేపడతామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అంతకు ముందు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గల డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్ ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య కళాశాల నియంత్రణలోకి తెస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన విషయాలతో పాటు వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, ప్రొఫెసర్ రమేష్ పాల్గొన్నారు.



## హెల్త్ ఇన్స్యూరెన్స్ చేపిద్దాం



- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్
- వరంగల్ జిల్లా టీయూడబ్ల్యూజే టెంజు కార్యవర్గ సమావేశం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జర్నలిస్టులందరికీ హెల్త్ ఇన్స్యూరెన్స్ చేయించాల్సిన అవసరం ఉందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ అన్నారు. గురువారం వరంగల్ తూర్పు జర్నలిస్టు పరపతి సంఘం భవనంలో టీయూడబ్ల్యూజే వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మిట్ట నవనీత్ గౌడ్ అధ్యక్షతన టీయూడబ్ల్యూజే టెంజు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గం పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. సభ్యులందరికీ హెల్త్ ఇన్స్యూరెన్స్ సదుపాయం కల్పించాలని, యూనియన్ ఐడీ కార్డులను పంపిణీ చేయాని, డెస్క్ జర్నలిస్టుల అక్రిడేషన్ కొనసాగించాలని, ఇంటి స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇప్పించేందుకు కృషి చేయాలని, వరంగల్ లో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు సహకారం అందించాలని, గుర్తింపు ఉన్న సంస్థల్లో పనిచేసే వారికే యూనియన్ సభ్యత్వాలు ఇవ్వాలని, అన్ని మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించాలంటూ ప్రవేశ పెట్టిన తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం బీఆర్. లెనిన్ మాట్లాడుతూరాష్ట్రంలో డెస్క్ జర్నలిస్టులను గుర్తించి అల్లం నారాయణ అక్రిడిటేషన్లు ఇప్పిస్తే... ప్రస్తుత ప్రభుత్వం కోత పెట్టేందుకు సిద్ధమైందని ఆరోపించారు. ఒక వేళ అదే జరిగితే పోరాటాలకు సిద్ధమని హెచ్చరించారు. గత 10 ఏళ్లుగా జర్నలిస్టులను అల్లం నారాయణ నేతృత్వంలోని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కడుపులో పెట్టుకుని కాపాడుకుందన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందించి జర్నలిస్టులకు మనోధైర్యాన్ని నింపిన ఘనత మన యూనియన్ కే దక్కుతుందన్నారు. యూనియన్ బలోపేతం అయితే ప్రెస్ క్లబ్ లను సునాయసంగా గెలుచుకోవచ్చన్నారు. అందుకుగాను వరంగల్ జిల్లా కమిటీ యూనియన్ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ఇకమీదట యూనియన్ వరంగల్ జిల్లా కమిటీ నిర్మాణాత్మకంగా పనిచేస్తూ సభ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తుమ్మ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెరుమాడ్ల వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరిపై పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన పిటిషన్ ను ప్రెస్ క్లబ్ కమిటీ వెనిక్కి తీసుకుని, వారి సభ్యత్వాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకిడి శ్రీనివాస్, కోశాధికారి రాపల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి నీలం శివ, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తౌటు కామేష్, కంది భరత్, కమటం వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ బండి రవి, టెంజు ఉపాధ్యక్షుడు పిండం విజయ్, ఎండి అమీర్, విద్యాసాగర్, వేణు, జాయింట్ సెక్రెటరీ కిరణ్, ప్రభాకర్, అనిల్, రమేష్, సనత్, ప్రదీప్, ఈసీలు, చందు, సంతోష్, కృష్ణ, యుగేందర్, నరేందర్, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com